క్లుప్తంగా

పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకం



మున్సిపల్ చైర్ పర్సన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

చుంచుపల్లి: నేడు పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకమని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. శుక్రవారం న్యూ గొల్లగూడెంలోని కిడ్స్ పార్క్ టాలెంట్ స్కూల్ రెండో వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులు ఇంటివద్ద శ్రద్ధ తీసుకుంటే ఉత్తమ విద్యార్థులుగా తయారవుతారని చెప్పారు. కిడ్స్ పార్క్ టాలెంట్ పాఠశాల యాజమాన్యం మంచి తరగతి గదులు, అధునిక విద్యా బోధనకు కృషి చేస్తున్నారని చెప్పారు. వార్డ్ కౌన్సిలర్ జి.కళ్యాణి, స్కూల్ వ్యవస్థాపకులు ఆర్.వెంకటేశ్వరరావు, పాఠశాల సొసైటీ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ రాంసింగ్, అల్లిశంకర్, ప్రభురాజు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫేర్ వెల్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సుజాతనగర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 4వ తరగతి విద్యార్థులు 5వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం నేతాజీ, ఉపాధ్యాయులు నరసింహం, వెంకటేశ్వరరావు, భాగ్యలక్ష్మి, ఆనందరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి




మాట్లాడుతున్న నరాటి ప్రసాద్

పాల్వంచరూరల్: విద్యార్థులు వేసవిసెలవులను వృథా చేయకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని టీఎస్‌ఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ నరాటి ప్రసాద్ కోరారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం ఇంప్యాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడువ్యసనాలకు అలవాటు పడకుండా, సమయాన్ని వృథా చేయకుండా ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రాజెక్టు వర్క్ పూర్తి చేయాలని కోరారు. విద్యార్థులు చిరుప్రాయంలోనే దేశభక్తి, నాయకుల జీవిత చరిత్రలను చదువుకుని అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ, సరోజ, దేవిశ్రీ, శ్యాంసన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

25న బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

ఇల్లెందు/ఇల్లెందురూరల్/టేకులపల్లి: బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఈనెల 25న ఇల్లెందు మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ, ఇల్లెందు మండల, టేకులపల్లి మండల అధ్యక్షులు నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, శీలం రమేష్, బొమ్మెర్ల వరప్రసాద్ వెల్లడించారు. ఇల్లెందు, టేకులపల్లిల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

25న 'చలో ఆలేరు'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: తెలంగాణలో అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, రుణాలు రద్దు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఘరానా మోసం చేసిందని ఎన్డీ చంద్రన్న వర్గం నాయకులు మోకాళ్ల రమేష్ తెలిపారు. శుక్రవారం ఇల్లెందు మండలం కొల్లాపురం గ్రామంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 25న చలో ఆలేరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపేందర్, సుగుణ, ముత్తయ్య, కృష్ణ, వెంకన్న, రమేష్, లింగస్వామి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోవోల్టేజీ సమస్యకు చెక్

- రూ.2.22 కోట్ల ఖర్చుతో పోలారంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు
- ఏజెన్సీలో వెయ్యి ఎకరాలకు అదనపు ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్, రైతులు

ఇల్లెందురూరల్: వర్షాధారిత చిన్నపాటి చెరువులు మినహా చెప్పుకోవడానికి ఒక్క సాగునీటి వనరు కూడా ఇల్లెందు ఏజెన్సీలో లేదు. దీంతో రైతులు బోర్లు, బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. చెరువులలో నీరు అడుగంటితే విద్యుత్ వినియోగం అమాంతం పెరుగుతుంది. ఇటువంటి సమయంలో ఎదురయ్యే లోవోల్టేజీ కారణంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వంటి ఘటనలు తరచూ జరుగుతుంటాయి. దీనికి పరిష్కారంగా కొమరారం, మాణిక్యారం సబ్‌స్టేషన్లతో పాటు పోలారం కేంద్రంగా మరో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని స్థానిక రైతులు అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. వారి సమస్యకు పరిష్కారం చూపుతూ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ క్రమంలో ప్రభుత్వం జీఓ నంబర్ 461 ద్వారా రూ.2.22 కోట్లు మంజూరు చేస్తే పోలారం కేంద్రంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తూ ఏప్రిల్ 20న ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వానికి అధికారుల ప్రతిపాదన..

ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించిన తరువాత క్షేత్రస్థాయిలో అందుకు అవసరమైన అదనపు వనరులపై క్షేత్రస్థాయి అధికారుల చేత ప్రభుత్వం సర్వే చేయించింది. తొమ్మిది గంటల సరఫరా చేపట్టిన సమయంలో మాణిక్యారం గ్రామపంచాయతీలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం నిరంతర విద్యుత్ సరఫరా కోసం పోలారంలో అదనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. తద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అదనంగా మరో వెయ్యి ఎకరాలకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు నివేదికలో వివరించారు.

సమస్యాత్మకంగా నిర్మాణ స్థలం..

పోలారం గ్రామపంచాయతీ పరిధిలో ప్రస్తుతం రెవెన్యూ, పట్టా భూములు అందుబాటులో లేకపోవడంతో క్రీడాప్రాంగణం, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామం వంటి అన్ని అవసరాలకు పంచాయతీ అధికారులు అటవీశాఖ నుంచి స్థలాన్ని సేకరించారు. ఇదే తరహాలో గ్రామానికి సమీపంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని గుర్తించి సబ్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించాలని కోరుతూ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సరోజిని, ఉపసర్పంచ్ శ్రీరాంకోటయ్య, పాలకవర్గ సభ్యులు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా తాజాగా మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం అటవీశాఖ స్థలాన్ని సంబంధిత అధికారులు అనుమతిస్తారా.. లేక రెవెన్యూ భూమిని కొనుగోలు చేయాల్సి వస్తుందా అనేది ప్రశ్నార్థకంగా ఉంది.

సమస్య తొలగిపోతుంది



ఏటా పంటలు గింజ పోసుకునే సమయంలో విద్యుత్ సరఫరాలో సమస్యలు వస్తుండేవి. ఆ సమయంలో తప్పని పరిస్థితిలో తాము రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సి వచ్చేది. ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పరిష్కరించేవారు. తాజాగా మంజూరైన సబ్‌స్టేషన్‌తో విద్యుత్ సమస్యకు తెరపడినట్లే.

– హర్యా, రైతు, పోలారం

రైతుల కల నెరవేరింది



ప్రభుత్వం చేపట్టిన తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా సమయంలోనే పోలారంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విద్యుత్ సమస్యతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే హరిప్రియ ప్రత్యేక చొరవ తీసుకొని మంజూరు చేయించడం ఆనందంగా ఉంది. రైతుల కల నెరవేరింది.

– వాంకుడోత్ సరోజిని, సర్పంచ్, పోలారం

ఇది రైతు ప్రభుత్వం



ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుండటంతో ఏజెన్సీ ప్రాంతాలలో విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో లోవోల్టేజీ, ఓవర్‌లోడ్ సమస్యలు తప్పడం లేదు. దీనికి పరిష్కారం చూపే లక్ష్యంతో పోలారం కేంద్రంగా సబ్‌స్టేషన్ ఏర్పాటును ప్రభుత్వానికి నివేదించి మంజూరు చేయించుకున్నాం.

– బానోత్ హరిప్రియ, ఎమ్మెల్యే, ఇల్లెందు

చలివేంద్రాలు ప్రారంభం



టేకులపల్లి: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సరిత

టేకులపల్లి: ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని టేకులపల్లి సర్పంచ్ బోడ సరిత, ఎంపీటీసీ జాలాది అప్పారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎండీ.మౌలానా, ఎల్.కిరణ్, కె.సురేష్, నోముల భానుచందర్, గుండా సుచరిత పాల్గొన్నారు. బోడు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ సమీపంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బోడు ఎస్ఐ రంజిత్‌కుమార్, సర్పంచ్ ఇర్ప లక్ష్మీనారాయణ ప్రారంభించారు.

కొత్తగూడెంరూరల్: జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన కొత్తగూడెం, పాల్వంచలో శుక్రవారం పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ట్రస్టు సభ్యులు కాంపెల్లి కనకేష్ పటేల్, అంజి ప్రారంభించి మాట్లాడారు. సభ్యులు జోగారావు, కాల్వ భాస్కర్, కిలారి శ్యాం, డాక్టర్ విజయ్‌కుమార్, చింత నాగరాజు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరావు, పుల్లయ్య, శంకర్, పుష్ప, నాగరాజు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కమిటీ ఎన్నిక

ఇల్లెందు: ఇల్లెందు ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం ఇల్లెందులో జరిగింది. అధ్యక్షుడిగా బి.నరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కృష్ణచైతన్య, కె.మహేష్, సహాయ కార్యదర్శిగా బండి రామారావు, సీహెచ్ కుమార్, కోశాధికారిగా ఎస్.వేణుగోపాల్, గౌరవాధ్యక్షులుగా గడ్డం వెంకటేశ్వర్లు, ఇల్లెందుల నాగేశ్వరరావు, లింగాల వెంకన్న, బి. ముత్యంలను ఎన్నుకున్నారు.

రోడ్డుపై ట్రాక్టర్ నిలిపి ఆందోళన



ఆందోళన చేస్తున్న సర్పంచ్, స్థానికులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామ పంచాయతీ రోడ్డుపైకి మున్సిపల్ మురుగు రావటంతో రోడ్డంతా గుంతలమయంగా మారిందని ఆ గ్రామ సర్పంచ్ కవిత గ్రామస్తులు శుక్రవారం రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ నిలిపి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అక్కడి చేరుకుని మున్సిపల్ ఏఈ రాము, కౌన్సిలర్ రాజకుమారిని పిలిపించి మాట్లాడడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి, మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అన్యాయం చేయొద్దు

జూలూరుపాడు: విద్యార్థులు తక్కువగా ఉన్నారనే కారణంతో వసతి గృహాలను మూసివేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. వసతి గృహాలను మూసివేస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకు దూరం అవుతారన్నారు. విద్యార్థులు తక్కువ ఉన్న హాస్టళ్లను మూసివేసి గురుకులాలు, హాస్టళ్లలో విలీనం చేస్తామని చెప్పడం సంక్షేమ వసతి గృహాలకు నష్టం చేయడమే అవుతుందని వాపోయారు. 20 మంది కంటే విద్యార్థులు తక్కువ ఉన్న హాస్టళ్లను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో అన్ని సదుపాయాలు కల్పిస్తే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. మూసివేత పేరుతో సంక్షేమానికి నిధులు తగ్గించి పేద విద్యార్థులకు అన్యాయం చేయవద్దన్నారు.

భూములను స్వాధీనం చేసుకోవాలి



నిరాహార దీక్ష చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

పాల్వంచరూరల్: పాల్వంచ రెవెన్యూలోని సర్వే నంబర్ 1 – 999 వరకు గల 15,525 ఎకరాల విస్తీర్ణంలోని షెడ్యూల్డ్ తెగలకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటి వరకు ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను జేఏసీ నాయకులు సోయం సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. షెడ్యూల్డ్ ఏరియాలో భూములను ఆదివాసీ హక్కులు, చట్టాలకు విరుద్ధంగా భూ ఆక్రమణదారులు పొందిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోయం సత్యనారాయణ, బాడిశ భిక్షందొర, ఊకే ముక్తేశ్వరరావు, సోయం చిన్నారి, కుర్సం రమేష్, శెట్టిపల్లి వెంకటేష్, కల్తి పాపయ్య, సడియం రాజేశ్వరరావు, పద్ద ప్రభాకర్, కొండ్రు సత్యనారాయణ, పద్దం నాగరాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

28న 'చలో కలెక్టరేట్'



మాట్లాడుతున్న గౌని నాగేశ్వరరావు

టేకులపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 200 రోజుల పనిదినాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వర్‌రావు, ఏఐకేఎంఎస్ జిల్లా నేత కల్తి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్, ఇఫ్టూ ఆధ్వర్యంలో ఈనెల 28న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ముత్యాలంపాడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ప్రచారం నిర్వహించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొలతలతో సంబంధం లేకుండా కూలీలకు రోజుకు రూ.750 ఇవ్వాలన్నారు.

పాల్వంచరూరల్: దంతలబోరు గ్రామంలో శుక్రవారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు పాల్గొని మాట్లాడారు. ఉపాధి పని కూలీలకు రోజువారీ వేతనం రూ.600 చొప్పున చెల్లించాలని, ప్రతి ఒక్కరికీ 12 రకాల నిత్యావసరాలు రేషన్ ద్వారా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. యస్నం నాగిరెడ్డి, అంచా శ్రీను, చంద్రం, మల్లికార్జున్‌రావు, కె.రాంబాబు, అన్నపూర్ణ, కవిత, వెంకటరమణ, సత్యవాణి, బి.లతారెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



ఇల్లెందురూరల్: మత పెద్దలతో నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకునేందుకే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలు అందిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, ముస్లిం రాష్ట్ర నాయకులు నయిమ్ ఖురేషి అన్నారు. పట్టణంలోని మేదర బస్తీ, రామవరం, పంజాబ్‌గడ్డ, సఫాయి బస్తీ, నేతాజి బస్తీలలో సుమారు 800 మంది ముస్లింలకు శుక్రవారం రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పేదల ఆకలిని గుర్తించి టీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు, ఆయన స్నేహితులు ఖాజీమ్ అలీలు తోఫాల పంపిణీకి సహకారం అందించినట్లు చెప్పారు. వై.శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల జమలయ్య, మాచర్ల శ్రీను, భూక్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రంజాన్ పండుగను పురస్కరించుకొని పేద ముస్లిం కుటుంబాలకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మత పెద్దల సమక్షంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదరికంలో ఉన్న ముస్లింలు కూడా రంజాన్ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా తమవంతు సహకారం అందించడం బాధ్యతగా భావించామని చెప్పారు. కాంతారావు, రాయల శ్రీనివాస్, గోపీనాథ్, వెంకన్న, శ్రీరాములు, శ్రీనివాస్, ఇబ్రహీం, ఖాతీబ్, మౌలానా, ఇనాయితుల్లా, రషీద్, పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: రంజాన్ పండుగ సందర్భంగా కొత్తగూడెంలోని ముస్లిం జర్నలిస్టులకు టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు శుక్రవారం తోఫా పంపిణీ చేశారు. ఎండీ కరీంపాషా, జయప్రకాష్, మహ్మద్‌షఫీ, కలీమ్, ఎంఏ మజీద్, ఫయామ్ అఫ్జల్ పఠాన్, అన్వర్ అలీ, జలీల్ పాల్గొన్నారు.

గుండెకు భరోసా ఇద్దాం..



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: గుండెపోటు, ఛాతి నొప్పితో బాధపడుతున్న వారికి అత్యవసరంగా సేవలదించి భరోసా నిచ్చేందుకు ప్రతిఒక్కరూ తమవంతు ప్రయత్నం చేయాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత అన్నారు. కొమరారం పీహెచ్‌సీలో కొమరారం పోలీసు, అటవీశాఖ సిబ్బందికి సీపీఆర్ విధానంపై శుక్రవారం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో శ్వాస తీసుకోవడం, గుండె కొట్టుకోకపోవడంలో సమస్య వచ్చినప్పుడు ప్రాణాలను రక్షించేందుకు రెండు చేతుల ద్వారా ఛాతిని కుదింపులో వేగంగా చేయడం ద్వారా గుండె పునర్జీవనం పొందేలా చేయడాన్ని కార్డియో పల్మొనరీ రిససిటేషన్ (సీపీఆర్) అంటారని చెప్పారు. ఇలా చేసి ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు.

ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా



ఆందోళన చేస్తున్న ప్రజాపంథా నేతలు

ఇల్లెందు: ఇంటి స్థలాలు లేని వారికి స్థలాలు కేటాయించాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలని, అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డిమాండ్ చేసింది. శుక్రవారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రజాపంథా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ అంకుషావలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి యాకుబ్‌షావలి మాట్లాడుతూ.. పట్టణంలో ఎంతోమంది పేదలు ఇంటి స్థలాలు, సొంతిళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అర్హులైన పేదలు పింఛన్ కోసం అల్లాడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, నిరుద్యోగులకు భృతి చెల్లించాలని, పేదలకు 12 రకాల నిత్యావసరాల రేషన్ పంపిణీ చేయాలని కోరారు. మల్లెల వెంకటేశ్వర్లు, పిల్లి మల్లేష్, రఘు, బండి వెంకటమ్మ, కుమారి, ప్రణయ్, లింగమూర్తి పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థిని నేనే..



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేది తానేనని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24న ఖమ్మంలో జరగనున్న నిరుద్యోగ నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని భుజస్కంధాలపై మోసిన తనకే అధిష్టానం టికెట్ ఇస్తుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. స్థానికేతరులు, నెలకోసారి వచ్చివెళ్లేవారు టిక్కెట్ వస్తుందని చెప్పుకోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, అంతోటి పాల్, సకినాల వెంకటేశ్వరరావు, గిన్నారపు నాగేందర్, పల్లపు వెంకటేశ్వర్లు, గుంటి జగన్‌మోహన్‌రావు, పైడిపల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్ కుటుంబాన్ని ఆదుకోండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: మల్టీ పర్పస్ వర్కర్ భూక్యా వెంకటేశ్‌ని ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి ఎంపీడీఓ పీడీఓ దుద్దుకూరి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. చుక్కాలబోడు మల్టీ పర్పస్ వర్కర్ భూక్యా వెంకటేశ్ ఈనెల 13న ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు రైతు వేదిక వద్ద జరిగిన ఎస్‌బీఎం మీటింగ్ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభం ఎక్కించడంతో విద్యుత్ షాక్ తగిలి కింద పడటంతో తీవ్ర గాయాలపాలై రెండు కాళ్లు పోగొట్టుకున్నట్లు చెప్పారు. రూ.20 లక్షలు నష్టపరిహారం, డబుల్ బెడ్‌రూం ఇల్లు, బాధితుడి ఇంట్లో ఒకరికి ఉద్యోగం, మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం జరగకపోతే పార్టీ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుగులోత్ రామచందర్, ఎట్టి నరసింహారావు, రవి, కోటిలింగం పాల్గొన్నారు.

పింఛన్ ప్రకటించకపోతే ప్రాణత్యాగం



మాట్లాడుతున్న నర్సయ్య

కొత్తగూడెంటౌన్: వచ్చే జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఉద్యమకారులకు పింఛన్ ప్రకటించకుంటే ప్రాణత్యాగాలకు వెనుకాడేది లేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969 నుంచి 2014 ఏడాది వరకు తెలంగాణ కోసం ఉద్యమించిన తాము లాఠీ దెబ్బల తినడమే కాక జైలుకు వెళ్లామన్నారు. వచ్చే ఆవిర్భావ దినోత్సవం నాటికైనా ప్రభుత్వం తమకు పింఛన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వలీబాబా, ఎడ్ల ఏలియా, కూచన కృష్ణారావు, అల్లి భాస్కర్‌రావు, దేవులపల్లి రామ్మూర్తి, కాకెల్లి సైమన్, సఫ్దార్‌బేగ్, ఎండీ మౌలానా, తమ్మిశెట్టి రామారావు, శ్రీపాద, సత్యనారాయణ, అలీముద్దీన్, కరీం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు నివాళి

సింగరేణి(కొత్తగూడెం): కుటుంబం పెద్ద తరువాత బాధ్యతలు మోయాల్సిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం విచారకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నకిరేకల్ వద్ద జరిగిన ప్రమాదంలో రుద్రంపూర్‌కు చెందిన కుసుమ మల్లేష్, ఆయన కుమారుడి మృతదేహాలను సందర్శించి, పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

నివాళులర్పించిన కార్మికులు..

ఈనెల 20న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుసుమ మల్లేష్‌కు ఆయన కుమారుడు అవినాష్‌ను కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీలో శుక్రవారం గని మేనేజర్ మురళీ ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు. పిట్ సెక్రటరీ నాగరాజు, పీఓ శ్రావణ్‌కుమార్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అద్దె భవనంలో 'అంగన్‌వాడీ' అవస్థలు..

టేకులపల్లి మండలం రామచంద్రునిపేట పంచాయతీ పాతర్లగడ్డ తండా మినీ అంగన్‌వాడీ కేంద్రానికి అద్దె కష్టాలు తప్పడం లేదు. పక్కా భవనం లేకపోవడంతో ఏళ్ల తరబడి అద్దె ఇంట్లోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : కేఎం తార,
సీడీపీఓ, టేకులపల్లి ప్రాజెక్టు
సెల్ నంబర్ : 94900 02168